

శ్రీ దత్త ఫ్యాషన్స్ వారి
శ్రీ వారాహి సిల్క్స్
కంచిపట్టు నిలయం
100 DAYS
CELEBRATION
మార్చి 18,19, 20
ప్రతి కొనుగోలుపై ప్రత్యేకమైన
"ఉచిత బహుమతులు"
. ప్రారంభించిన నాటి నుండి మమ్మలి ఆదరించిన కష్ట మర్ల దేవుళ్ళు అందరికి మా ధన్యవాదములు.
. మీ అందరి ఆధారాభిమానులతో 100 రోజులు పూర్తి చేసుకున్న శుభ సందర్భముగా మీ "వారాహి సిల్క్స్" వారి 100 రోజుల సెలబ్రెషన్స్ " వేడుకులు జరుపుకొంటున్న సందర్భంగా.
. మార్చి 18, 19, 20 తేదీలు. ఈ మూడు రోజులు షాపింగ్ చేసిన ప్రతి కొనుగోలుపై ఉచిత 'బహుమతులు" అందుకోబడుతుంది.
శ్రీ దత్త ఫ్యాషన్స్ వారి
శ్రీ వారాహి సిల్క్స్
కంచి వీవర్స్ కలక్షన్స్
1. కంచి పట్టు
2. ధర్మవరం
3. ఉప్పాడ
4. ఆరణి
5. గద్వాల్
6. బ్రైడల్స్ శారిస్
7. కంచి కనక ధార పట్టు
8. కంచి తులసి పట్టు
9. పరిణయ పట్టు
OUR FIRST 100 DAYS.
Contact Us: 96668 89459
Near Krishna Park, Palakonda Road.Srikakulam - 532001,Andhra Pradesh
High Fancy Sarees ! Designer Sarees ! Ethnic Wear! Kanchi ! Aaraani ! Gandharva pattu!
follow us on : Face book instagram whatsapp

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 18-3-2025
సంపుటి: 20 సంచిక: 301
పేజీలు: 8 వెల: రూ.1

# 'కసి' తీరా భార్యనే నరికేశాడు!

❖ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

సంతసీతారాంపురం (ఎస్ఎస్ఆర్ పురం) గ్రామానికి చెందిన గాలి నాగమ్మ (45)ను ఆమె భర్త గాలి అప్పలరెడ్డి సోమవారం రాత్రి 11 గంటల సమయంలో కత్తితో నరికి హతమార్చాడు. హత్య చేసిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు హత్యకు వినియోగించిన కత్తి తీసుకొని వెళ్లి నిందితుడు లొంగిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. భార్య, భర్తలు ఇద్దరూ వ్యవసాయ కూలీలుగా జీవనోపాధి పొందుతున్నారు. సోమవారం భార్యాభర్తలు ఇద్దరూ కలిసి రణస్థలం మండలం కొవ్వాడలో నీలగిరిచెట్టు బెరడు తొలిచే కూలీ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగొచ్చారు. నిత్యం భార్యభర్తలు ఈ పనులే చేస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి భోజనం ముగించిన తర్వాత భార్యభర్తల మధ్య స్వల్ప ఘర్షణ జరిగినట్టు చెబుతున్నారు. అందులో భాగంగానే ఆవేశంతో చెట్టు బెరడు తొలగించడానికి ఉపయోగించే కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో సంఘటన - మిగతా చివరి పేజీలో



**పూర్ టు రిచ్.. దరిద్రం నుంచి ధనవంతుడిగా మార్చడం. ఇది 2024 ఎన్నికల సమయంలో కూటమి తరఫున చంద్రబాబునాయుడు తెర మీదకు తెచ్చిన నినాదం. అంటే ప్రస్తుతం బీదలుగా ఉన్న తమ స్థితిగతులను మార్చి ధనవంతుల సరసున చంద్రబాబు చేరుస్తారని చాలామంది భావించి వుంటారు. అసలు ఈ స్లోగన్ పట్టించుకోకుండానే జగన్మోహన్‌రెడ్డి మీద విరక్తితో ఓటేసినవారే ఎక్కువ మంది ఉన్నారు. ఆ విషయం పక్కన పెడితే పూర్ టు రిచ్ నినాదంలో పేదవాడ్ని ధనికుడ్ని చేయడమే. కానీ చంద్రబాబు రాజకీయాలు ఆర్థికవేత్తలకు తప్ప ఆకలితో ఉన్నవాడికి అర్థంకావు. ప్రస్తుతం దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నారని చూపిస్తున్నవారెవరూ దరిద్రులు కారని, వారు కూడా సంపాదనపరులేనని నిరూపించే పనిలో పడింది ప్రభుత్వం.**







## కంగ్రాట్స్..! మీరు

# పూర్ టు రిచ్ అయ్యారు

- ముగిసిన పీ-4 సర్వే
- మూడొంతుల ఇళ్లకు వెళ్లని సిబ్బంది
- 20 శాతం మించని పేదలు
- నిధుల సమీకరణకు ప్రభుత్వం పాట్లు
- అప్ప దొరకని చోట తప్పని జిమ్మిక్కులు
- సంక్షేమ పథకాలకు వర్తింపజేయకుంటే మేలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇప్పటి వరకు రోజుకు రూ.600 నుంచి రూ.700 కూలీ తెచ్చుకుంటున్నవారిని దినసరి కూలీ కింద లెక్క కట్టాం మనం. అదే ఇంటిలో ఇద్దరు కూలికి వెళ్తే.. దాదాపు రూ.50 వేలు నెలకు సంపాదిస్తున్నారని, అటువంటప్పుడు వారు బీదలు ఎలా అవుతారన్నది ప్రభుత్వం దగ్గరున్న ప్రశ్న. అలాగే నెలకు రూ.4వేలు పింఛను తీసుకుంటున్న వ్యక్తి ఇంతవరకు నిస్సహాయుడి కింద పరిగణించాం. కానీ నెలకు రూ.4వేలు వస్తుంటే సంపాదనపరుడేకాని సంపాదన లేనివాడెలా అవుతాడని ప్రభుత్వం అడుగుతున్న ప్రశ్న. ఇక ఏసీలు, మోటారువాహనాలు ఉన్నవారు ఎప్పుడో ధనికుల కింద నమోదైపోయారు. ఆ తర్వాత ఇప్పుడు విద్యుత్ వాడకాన్ని బట్టి, ఇంటి పైకప్పును బట్టి కూడా పేద, ధనికులను నిర్ణయించే పనిలో పడింది ప్రభుత్వం. తన జీవితంలో ఇంత టైట్ పొజిషన్ ఎప్పుడూ చూడలేదని, అప్పులు పుట్టక, పథకాలు ఇవ్వలేక సతమతమవుతున్నానంటూ ఒకటికి పదిసార్లు చెబుతున్న చంద్రబాబు ఒక వైపు అమరావతి నిర్మాణం, మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులు, దీనికి తోడు సంక్షేమ పథకాలు అమలుచేయాలంటే తమ రాష్ట్రం బీద రాష్ట్రం కాదని, సొమ్ములున్నాయని ప్రపంచ బ్యాంకుకు చెప్పాలి. ఈ భూమ్మీద ఎక్కడైనా డబ్బున్నోడికే అప్పు పుడుతుంది. తీర్చగలిగే సత్తా ఉన్నోడికే బ్యాంకులు రుణాలిస్తాయి. ఈ సూత్రం యూనివర్సిటీ స్థాయిలోనే చదువుకున్నారు కాబట్టి చంద్రబాబునాయుడు తన రాష్ట్రంలో కేవలం 20 శాతం మందే పేదలున్నారని, భూగోళంలో ఎక్కడైనా ఇంతకంటే తక్కువుండరని చెప్పడం కోసం ఒక సర్వేను ప్రారంభించారు. అది ఎప్పుడు మొదలైందో తెలీదుకానీ, మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఇందులో యంత్రాంగం కొందరి ఇంటికి వెళ్లి సర్వే చేసిన మాట వాస్తవం. కానీ అధిక శాతం కార్యాలయాల్లో కూర్చునే మమ అనిపించేశారు. ఎందుకంటే.. జగన్మోహన్‌రెడ్డి తెచ్చిన సచివాలయ వ్యవస్థ వద్ద ప్రతీ ఇంట్లోనూ ఏమున్నాయో ఐదేళ్ల క్రితమే తెలిసిపోయింది. అదనంగా దానికి ఏమి జోడించినా ధనవంతుల కిందకే వస్తారు కాబట్టి, కనీసం ఆ గుమ్మాలు ఎక్కకుండా సర్వే పూర్తిచేసేశారు. ఎలాగూ 20 శాతానికి మించకుండా పేదల సంఖ్యను - మిగతా చివరి పేజీలో





శ్రీకాకుళంలో వివిధ హీరోల అభిమానుల మధ్య కన్నడ హీరో పునీత్ పుట్టినరోజు వేడుకలు



## స్ఫూర్తిమంత్రం..

## ప్రశంసలు అందుకుంటున్న నాగేంద్ర బృందం

# సేవలతో 'పునీత'o!

### ఘనంగా పునీత్‌రాజ్‌కుమార్ జయంతి

తమ స్ఫూర్తిదాత పునీత్ రాజ్‌కుమార్ జయంతి ఉత్సవాలను ఈ సంఘం సభ్యులు నిన్న ఘనంగా నిర్వహించారు. జగన్నాథపురంలో నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 20 అడుగుల పునీత్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి, పూలమాలలతో అలంకరించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు పంపిణీ చేశారు. నరసన్నపేట తపోవనం వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు, గోవులకు ఆహారం అందజేశారు. ఇక సాయంత్రం శ్రీకాకుళం నగరంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేసి.. పునీత్ రాజ్‌కుమార్ ఆశీస్సులు, స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పునీత్‌రాజ్‌కుమార్ ఫ్యాన్స్ అధ్యక్షుడు పుక్కళ్ల నాగేంద్ర, సవర రాజు, నాగార్జున ఫ్యాన్స్ పొట్నూరు సంతోష్, మహేష్‌బాబు ఫ్యాన్స్ షాజు, ఈశ్వర్, ప్రభాస్ ఫ్యాన్స్ గోపాల్, వివిధ హీరోల అభిమానులు పాల్గొన్నారు.



**డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి**

తెలుగు ప్రజలకు సినీ అభిమానం మెండు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగు నటీనటులకు వేలసంఖ్యలోనే అభిమాన సంఘాలు ఉన్నాయి. అయితే తెలుగు నటులను తెలుగువారు అభిమానించడం సాధారణమే.కానీ పెద్దగా సంబంధంలేని కన్నడ చిత్రసీమకు చెందిన అగ్రహీరో పేరుతో సంఘం పెట్టడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం పెద్ద విశేషమే. అది కూడా ఆ హీరో అనూహ్య పరిస్థితుల్లో మరణించడం, జీవించి ఉన్నప్పుడు ఆయన చేసిన సేవా కార్యక్రమాల గురించి తెలుసుకుని వాటినే స్ఫూర్తిమంత్రంగా తీసుకున్న సేవాతత్పరుడు పుక్కళ్ల నాగేంద్ర. సంతబొమ్మాళి మండలం జగన్నాథపురానికి చెందిన నాగేంద్ర స్వతహాగానే వితరణశీలి. ఉద్యోగం చేస్తున్న ఈయన తన సంపాదనలో కొంత వెచ్చించి కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో చాలాకాలంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. చిరంజీవి అభిమాని అయిన నాగేంద్ర 2021లో జరిగిన ఒక ఘటనతో తన కార్యక్రమాల దశదిశను మార్చారు. ఆ ఏడాది అక్టోబర్ 29న కన్నడ సూపర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్ జిమ్ చేస్తూ గుండెపోటుతో మరణించారు. ఆ సమాచారంతోపాటు ఆయన జీవిత విశేషాలు, చేసిన సేవల గురించి తెలుసుకున్న నాగేంద్ర వాటి నుంచి స్ఫూర్తి - మిగతా చివరి పేజీలో







● ఎడిటోరియల్

# పాక్ తెర మీద భారత్ సినిమా!

**2019** ఫిబ్రవరి 14న జమ్మూకాశ్మీర్ జాతీయ రహదారిలో మన సైనికులను తీసుకువెళ్తున్న వాహనాల కాన్వాయ్ మీద లేథిపురా వద్ద కారుతో ఆత్మాహుతి బాంబుదాడి జరిగింది. ఇందులో 40 మంది సీఆర్‌పీఎఫ్ సైనికులు మరణించిన విషయం గుర్తుంది కదా..! ఇప్పుడు ఇదే సీన్ పాకిస్తాన్ గడ్డ మీద జరిగితే ఎలా ఉంటుందో చూపించారు బలూచ్ లిబరేషన్ ఆర్మీ. టేబుల్ మారింది.. వడ్డించేవాడు మారాడు అంతే. వంటలు మారలేదు.. వండేవాడు మారాడు. 2014 వరకూ కాశ్మీర్ టేబుల్ మీద పాకిస్థాన్ మనకి వడ్డిస్తూ వచ్చింది. 2015 నుంచి పాకిస్తాన్ టేబుల్ మీద మనం వడ్డిస్తున్నామ్. బీఎల్‌ఏ ఆదివారం మధ్యాహ్నం పాకిస్తాన్ సైనిక కాన్వాయ్ మీద ఆత్మహతి దాడి చేసి 90 మంది సైనికులని హతమార్చింది. మొత్తం 8 ప్రయాణీకుల బస్సులు ఒక దాని వెనుక ఒకటిగా టఫ్తాన్ వైపుగా ప్రయాణిస్తున్న సమయంలో నోష్కి అనే ప్రాంతం దగ్గరికి వచ్చే సరికి రోడ్డు పక్కగా పార్క్ చేసి ఉన్న కారు ఒక్కసారిగా బస్సు మీదకి దూసుకువచ్చి పేలిపోయింది. బస్సుల్లో ఉన్న పాకిస్తాన్ ఫ్రాంటియర్ ఫోర్స్‌కి చెందిన సైనికులు మరణించారు. బీఎల్‌ఏ చాలా పకడ్బందిగా ప్లాన్ వేసి దాడి చేసింది. బీఎల్‌ఏలో రెండు విభాగాలు ఉన్నాయి. 'మజీద్ బ్రిగేడ్'.. ఇది ఫిదాయి (ఆత్మాహుతి) విభాగం. అవసరం అయినప్పుడు బలూచిస్తాన్ కోసం ప్రాణాలు వదలడానికి సిద్ధంగా ఉండే యువకులతో ఉంటుంది. నిన్నటి దాడికి పాల్పడింది మజీద్ బ్రిగేడ్ సభ్యులే. ఒక కారులో పేలుడు పదార్థాలు నింపి బస్సు దగ్గరికి రాగానే నేరుగా బస్సుని గుద్ది పేలుడు పదార్థం పేల్చేసి విధ్వంసం సృష్టించాడు. బస్సు పేలిపోగానే వెంటనే 'ఫతే స్క్వాడ్' సభ్యులు వెనుక వస్తున్న బస్సు మీద కాల్పులు జరిపి బస్సులో ఉన్న సైనికులు అందర్నీ చంపేశారు. ఫతే స్క్వాడ్ చేతుల్లోని ఎం-4 అసల్ట్ రైఫిల్స్ 2020లో అమెరికా సైన్యం కాబూల్ ఎయిర్‌బేస్‌లో వదిలిపెట్టినవే. అమెరికన్ ఆర్మీ దాదాపుగా 6వేల ఎం-4 అసాల్ట్ రైఫిల్స్, బులెట్స్ మ్యాగజైన్స్‌తో సహా వదిలివెళ్లింది. సో.. ట్రంప్ మా ఆయుధాలు మాకిచ్చేయండి అని డిమాండ్ చేసింది నర్మగర్భంగా మేము చెప్పిన వాళ్లకి ఇవ్వండి అని అర్థం చేసుకోవాలి. మొన్నటి దాడిని పరిశీలిస్తే ఇరాక్‌లో ఐసీస్ టెర్రరిస్టులు అమెరికన్ సైన్యం మీద చేసిన దాడులని గుర్తుకు తెస్తున్నాయి. ఉన్నట్లుండి ఐసీస్ టెర్రరిస్టులు చిన్న కారులో వచ్చి యుద్ధ టాంక్‌ని గుద్ది పేల్చేవాళ్లు వెంటనే మరో గ్రూపు వెనుక ఉన్న టాంక్ మీదకి గ్రానెడ్స్‌తో దాడి చేసి ముందు పేలుడుకి గురైన టాంక్‌కి సపోర్ట్ అందకుండా చేసి చివరికి రెండు టాంక్‌లని, అందులో ఉన్నవాళ్లని చంపేసేవారు. ముఖాముఖీ పోరులో కంటే చిన్న చిన్న గెరిల్లా ఫైట్స్‌లోనే ఎక్కువమంది అమెరికన్ సైనికులు చనిపోయారు. నిన్నటి బీఎల్‌ఏ దాడి కూడా ఇరాక్‌లో జరిగిన దాడిలాంటిదే. అసలు 8 బస్సుల్లో ఫ్రాంటియర్ ఫోర్స్ (పారా మిలిటరీ)ని టఫ్టాన్‌కి ఎందుకు తరలిస్తున్నట్లు? తఫ్టాన్ అనేది పాకిస్థాన్ ఇరాన్ సరిహద్దులో ఉన్న పట్టణం. బీఎల్‌ఏని బలూచిస్థాన్ నుంచి ఇరాన్ బోర్డర్ వరకూ తరిమేసి తఫ్టాన్ దగ్గర నుంచి ఇరాన్ లోకి పారిపోకుండా అక్కడ సైనికులు ముందే ఉంటారు కాబట్టి ముందుకు వెళ్లినా లేదా వెనక్కి వచ్చినా పాకిస్తాన్ సైన్యం చేతిలో బీఎల్‌ఏ ఫైటర్లు చనిపోవాల్సిందే. అందుకే ముందుగా 500 మంది సైనికులని టఫ్తాన్‌కి పంపించాలని ప్లాన్ చేసింది పాకిస్తాన్ సైన్యం. మిలిటరీ ట్రక్కులు అయితే తెలిసిపోతుంది కాబట్టి సాధారణ ప్రయాణీకుల బస్సుల్లో తరలించింది. కానీ ఎవరో ప్లాన్ లీక్ చేశారు బీఎల్‌ఏకి. ప్లాన్ లీక్ అయ్యింది కాబట్టే హైవే మీద కాపుకాసి మరీ దాడి చేయగలిగింది బీఎల్‌ఏ. దాడి చేసిన దృశ్యాలని పాకిస్తాన్‌లోని మీడియాకి తప్ప భారత్, మధ్యప్రాచ్యంలోని మీడియా హౌస్‌లకి వీడియోతో వివరంగా దాడి ఘటనలని మెయిల్ చేసింది బీఎల్‌ఏ. ప్రస్తుత బీఎల్‌ఏ దాడులు ఇరాక్‌లోని పరిస్థితులని గుర్తుకు తెస్తున్నాయి. సద్దాంహుస్సేన్ అధికారంలో ఉన్నన్నాళ్లు ఇరాక్‌లో డాలర్‌కి ప్రత్యేక ప్రాముఖ్యత ఉండేదికాదు. అమెరికా ఇరాక్ మీద ఆంక్షలు విధించాక ఇరాక్ కరెన్సీ తన విలువ కోల్పోయింది. దాంతో వ్యాపార సంస్థలు డాలర్స్‌కి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం మొదలుపెట్టాయి. ఇరాక్‌లో డాలర్‌కి డిమాండ్ పెరిగాక సీఐఏకి డాలర్లు తీసుకొని సమాచారం ఇచ్చేవాళ్లు ఎక్కువయ్యారు. ఒక దశలో ఇరాక్ ఇంటెలిజెన్స్ అధికారులు కూడా వేలకొద్ది డాల్లర్లకి ఆశపడి కీలకమైన సమాచారాన్ని సీఐఏకి అమ్ముకున్నారు. సద్దాం పతనానికి కారణం డాలర్ మీద ఉన్న ఆశ కూడా ప్రముఖ పాత్ర వహించింది. ప్రస్తుత పాకిస్తాన్ పరిస్థితి కూడా ఒకప్పటి ఇరాక్ పరిస్థితికి భిన్నంగా లేదు. ముఖ్యమైన ఆపరేషన్ సమాచారం రెండు రోజుల ముందే బీఎల్‌ఏకి దొరికి ఉండవచ్చు లేకపోతే ముందస్తు ఏర్పాట్లుచేసుకొని దాడికోసం ఎదురుచూడరు.



శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఫిట్టర్ లావేటి చంద్ర శేఖర్ పెద్ద కుమారునికి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైజాగ్ అపోలో ఆస్పత్రిలో రోజుకు సుమారు రూ.లక్ష వరకు ట్రీట్మెంట్‌కి ఖర్చు అవుతుంది తెలుసుకొని మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్ అసోసియేషన్ తరుపున తమవంతు ఆర్థిక సహాయంగా మున్సిపల్ కాంట్రాక్టర్స్ తరపున 53500 రూపాయలు విరాళంగా మంగళవారం అందించారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

# సమస్యల కొలువులో శివరాంపురం

**(సత్యంన్యూస్, వజ్రపుకొత్తూరు)**

మండలంలోని నగరంపల్లి పంచాయతీ పరిధిలో శివరాంపురం గ్రామం సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని సీపీఎం నాయకులు బమ్మిడి ఆనందరావు అన్నారు. మంగళవారం సీపీఎం ప్రతినిధి బృందం ఆ గ్రామంలో పాదయాత్ర చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామ ప్రజలందరూ పూండి గల్లి వెళ్లడానికి ప్రధాన రహదారి సుమారు 750మీటర్లు ఉందని, ఈ రహదారి సరిగా లేకపోవడంతో వాహన చోదకులు ప్రజలు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయాన్ని గమనించిన గత పాలకులు 2018న ఆ రోడ్డు శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారు. మరల 2020లో మరో ప్రభుత్వం శంకుస్థాపన చేసి మరో శిలాఫలకం వేశారు. కానీ ఆ ఊరికి రోడ్డు మాత్రం ఒక్క ఇంచి కూడా వేయలేదు. అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఊరు మూడు వీధులకి రెండు వీధులు గత సంవత్సరం నుండి కరెంట్ బల్బులు వెలగక, చినుకు పడితే చెత్తడిగా ఏర్పడి ఇండ్లకు చేరుకునే పరిస్థితి దారుణంగా ఉందని సిపిఎం ప్రతినిధి బృందం వద్ద ఆ గ్రామ ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అని వారన్నారు. ఇంటింటికి ఇచ్చే కొలై కూడా చాలా బాగా లీకేజీలు ఉండటం వలన కొన్ని ఇండ్లకు నీరు చేరడం లేదని వారు అన్నారు. ఈ లీకేజీలు నీరు త్రాగడం వలన అనారోగ్యాలు బారిన పడుతున్నామని వారు అన్నారు. ఈ గ్రామంలో భర్తలు చనిపోయి సంవత్సరాలు గడుస్తున్న విడో పింఛను ఇప్పటికీ మంజూరు చేయకపోవడం శోచనీయమని వారు అన్నారు. కరెంట్ చార్జీలు గతం కంటే ఇప్పుడు ఎక్కువ వస్తుందని వారి బిల్లులు చూపించారు. కరెంటు కూడా ఎప్పుడు ఆగుతుందో ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితిని ఈ బృందం దగ్గర వాళ్లు గోడు వినిపించారు. పై సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 24వ తేదీన నగరంపల్లి సచివాలయం వద్ద ఆందోళన చేపడుతున్నట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్.మోహన్రావు, ఎన్ చంద్రయ్య టి భాస్కర్ రావులు, బి అప్పన్నతోపాటు ఆ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# తండ్రిని కోల్పోయి అనాధలైన బాలికలను ఆదుకోండి..!

**(సత్యంన్యూస్, పలాస)**

పలాస మండలం స్థానిక సూది కొండ ప్రాంతంలో బుట్ట గంగాధర్, సరళ దంపతులు ముగ్గురు కుమార్తెలతో నివశిస్తున్నారు. గంగాధర్ దివ్యాంగ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి. రెక్కాడితే గాని డొక్క నిండని కుటుంబం వారిది. ఒక చిన్న ఇల్లు తప్ప వేరే ఆస్తులు లేని కుటుంబం వారిది. ఇటీవల ఒరిస్సా గండహతి ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో



గంగాధర్ అక్కడికక్కడే మరణించగా భార్య సరళ కు ఒక కాలు, నడుము విరిగిపోయాయి. ఇప్పుడు ఆ ముగ్గురు ఆడపిల్లలు అనాధలుగా మిగిలారు. ఆ కుటుంబం పరిస్థితి చాలా దీనస్థితిలో ఉంది. దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ వార్తను స్పందించి ముందుకొచ్చి మీకు తోచిన సహాయాన్ని ఈ ఆడపిల్లలకు అందించి వారికి చేదోడుగా నిలబడాలని కోరారు. దాతలు 8374708027 నెంబర్‌కు తోచిన సాయం చేయాలని కోరారు.

# ఎస్సీ వర్గీకరణ హర్షణీయం



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

రిజర్వేషన్‌లను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ఒక యూనిట్ తీసుకొని ఎస్సీ లను ఏబీసీలుగా వర్గీ కరణ చేసినందుకు గానూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షులు పురందేశ్వరి, ఏకసభ్య కమిషన్ ప్రతినిధులు రాజీవ్ రంజిన్ మిశ్రా, ఎమ్మార్పీఎస్ వ్యవస్థా పక అధ్యక్షులు మంద క్రిష్ణమాదిగలకు టీడీపీ ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు.

## సంపాదనలో కొంతభాగం సేవలకు వాడాలి

**(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)**

మండలంలోని అల్లినగరానికి చెందిన నిరుపేద గేదెల చిన్నారావు గతంలో జరిగిన ప్రమాదంలో రెండు కాళ్ళు పోగొట్టుకోగా, ఇటీవలే దాతల సహకారంతో మూడు చక్రాల కుర్చీ, నిత్యావసర సరుకులు అందించిన విషయం విదితమే. అయినప్పటికీ కనీసం వైద్యఖర్చులకు, మందులు కొనుగోలుకు నగదులేక అవస్థలుపడుతున్న చిన్నారావుకు ఒప్పంగిలో పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తూ నగరంలో కత్తెరవీధికి చెందిన ఆదిల్‌షా ముందుకు వచ్చి అవసరమైన మందులను, కొంత నగదుని అందించి మాట్లాడుతూ ఆపదలో ఉండేవారికి చేదోడుగా ఉండాలని, మన సంపాదనలో కొంతభాగం సేవలకు వినియోగించాలని, పరుల సేవయే మాధవసేవని కొనియాడారు. ఇందుకు సహకరించిన ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమా శంకర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, బి.జగదీశ్, ఉర్లం శివతేజ, బాధితుడు చిన్నారావు పాల్గొన్నారు.





# సామాన్యుడే..హీరో!

యే ముహూర్తాన రామ్ చరణ్ రంగస్థలం సినిమా చేశాడో కానీ ఆ రోజు నుంచీ మన తెలుగు హీరోలు సామాన్యుడిని వదలడం లేదు. అడవిలో కట్టెలు కొట్టేవాడు, సముద్రంలో చేపలు పట్టేవాడు, జాతరలో జీళ్ళు అమ్మేవాడు.. ఇలా రెక్కాడితే కానీ డొక్కాడని వారి జీవితాలను కెమెరాలలో బంధించి ఆ చిత్రాను వారికే బ్లాక్‌లో అమ్మేస్తున్నారు. యే మాటకా మాట,కష్టం అంటే ఎలా వుంటుందో తెలియ కుండా పెరిగిన మన నటవారసులు ఆ క్లిష్టమైన పాత్రలను అవలీలగా చేసి పడేస్తున్నారు.అదెంత అవలీలగా అంటే వాళ్ళ తండ్రులు, తాతలు కంటే వీళ్ళే బాగా నటిస్తున్నారు అన్నంతగా. వీళ్ళు నటులా అనిపించుకున్న వాళ్ళు కూడా వీళ్ళింత నటులా అని మనం ముక్కున వేలేసుకునేలాగా వాళ్ళు ఆ పాత్రలను నటించి పడేస్తున్నారు అంటే దానికి ముఖ్య కారణం వాటి వెనుక వున్న సాంకేతిక నిపుణులు, వారిలో మరీ ముఖ్యంగా వాటి దర్శకులు.మరి అలాంటి ప్రతిభావంతులైన దర్శకులకి సినిమాల్లో బత్తాయిజాన్ని చొప్పించాల్సిన ఖర్మ ఎందుకో నాకు అర్థం కావడం లేదు. పెద్ద హీరోల తెలుగు సినిమాని అత్యవసరం అయితే తప్ప థియేటర్లో చూడకూడదని దిల్ రాజు , అల్లు అరవింద్ ల మీద ఒట్టు పెట్టుకున్న నేను ఓటీటీ లోకి వచ్చిన తండేల్ సినిమాని ఒక గంట చూసాను.నాకు పెద్దగా ఎక్కలేదు. నేను నాగచైతన్య స్క్రీన్ ప్రెజన్స్‌ని చాలా ఇష్టపడతాను అలాంటిది నాకు అతని పాత్ర రుచించలేదు.ఇక యే పాత్ర నయినా తెల్లగా తొమీపడేసే డాక్టర్ సాయి పల్లవి అయితే "రాజూ రాజూ" అని కలవరించే సైక్రియాటిక్ పేషంట్ లాగా అనిపించింది. ఇంకా గంట పైన సినిమా వుంది కాబట్టి అది కూడా చూసేస్తే కానీ ఆ సినిమా మీద పూర్తి అవగాహనకి రాలేను కానీ కథ పాకిస్థాన్ చేరాక ఇక చూడలేక కట్టేసాను. ఇంకో రోజు కాస్త తీరికగా చూస్తాను సినిమాను. ఈ సినిమా ద్వారా నాకు సంతోషం కలిగించిన విషయం ఏమిటంటే తెలుగు సినిమా నేనిలా వెళ్ళగానే అలా నా వెనుకే గుజరాత్ దాకా వచ్చేయడం !!! **- రఘు శ్రీమంతుల**

# అందాల నిధి వెయిటింగ్ ఇంకా ఎన్నాళ్లు?



**నిధి** అగర్వాల్ ఇండస్ట్రీలో అడుగుపెట్టి దశాబ్దకాలం కాబోతున్నా ఇప్పటివరకు ఈమె చేసిన సినిమాల సంఖ్య చాలా తక్కువ. కొందరు హీరోయిన్స్ కెరీర్ ఆరంభంలో ఏడాదికి రెండు మూడు అంతకు మించి సినిమాలు చేసిన దాఖలున్నాయి. కానీ నిధి అగర్వాల్ మాత్రం 'ఇస్మార్ట్ శంకర్' సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న పెద్దగా ఫలితాన్ని పొందలేదు. ఆ సినిమా వల్ల వరుస ఆఫర్లు సొంతం చేసుకోలేకపోయింది. తెలుగులో ఈమె ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తోంది. ఆ రెండు సినిమాల విడుదల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంది. నిధి అగర్వాల్‌తోపాటు ఆమె ఫ్యాన్స్ ఆ రెండు సినిమాల విడుదల ఎప్పుడు అని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ ముద్దుగుమ్మ 2022లో చివరగా హీరో, కలగ తలైవన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలు పెద్దగా ఆడకపోవడంతో ఆఫర్లు రాలేదు. కానీ లక్కీగా తెలుగులో ఏకంగా పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న హరి హర వీరమల్లు సినిమాలో అవకాశం కొట్టేసింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటే కచ్చితంగా టాలీవుడ్‌లో వరుసగా పది సినిమా ఆఫర్లు వస్తాయని నిధి అగర్వాల్ ఆశ పడుతుంది. కానీ పవన్‌కళ్యాణ్ బిజీ షెడ్యూల్ వల్ల దాదాపు మూడు ఏళ్లుగా ఈ సినిమా వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తుంది. ఎప్పటికీ ఈ సినిమా విడుదల అయ్యేది క్లారిటీ లేదు. కానీ మేకర్స్ మాత్రం ఈ ఏడాదిలో విడుదల చేస్తామని అంటున్నారు. వీరమల్లు సినిమా కాకుండా ప్రభాస్‌తో రాజాసాబ్ సినిమాలోనూ ఈ అందాల నిధి నటిస్తుంది. వీరమల్లు సినిమా మాదిరిగానే రాజాసాబ్ సినిమా సైతం వాయిదాల మీద వాయిదాలు పడుతూ వచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో సినిమా విడుదల ఉంటుందని అంతా అన్నారు. కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో మళ్లీ వాయిదా పడే అవకాశాలున్నాయి. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటే కచ్చితంగా మూడు నాలుగు పెద్ద ఆఫర్లు వస్తాయనే నమ్మకంతో నిధి అగర్వాల్ ఉంది. **- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

# విమర్శల నుంచి తప్పించుకోలేకపోతున్న 'కన్నప్ప'

'కన్నప్ప'గా ప్రేక్షకుల ముందుకు రావడానికి మంచు విష్ణు రెడీ అవుతున్నాడు. వచ్చే నెల 25వ తేదీన ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ వేగాన్ని పెంచారు. 'కన్నప్ప' చరిత్రను ఫారిన్ లొకేషన్స్ లో చిత్రికరించడమనేది మొదటి నుంచి కూడా చర్చనీయాంశమైంది. ఒక కోయగూడానికి చెందిన మొరటు వ్యక్తిని యుద్ధ వీరుడిగా చూపించడం .. శివుడికి మీసాలు లేకపోవడం.. ప్రభాస్ లుక్ అయోమయంగా అనిపించడం చాలామందికి అసంతృప్తిని కలిగించింది. ఈ నేపథ్యంలో వదిలిన 'శివశివశంకర.." పాటలో, కన్నప్ప తనకి అందుబాటులో ఎలాంటి పాత్ర లేకపోవడం వలన నోట్లో నీళ్లు పోసుకుని శివలింగాన్ని అభిషేకిస్తాడు. ఆ తరువాత షాట్ లోనే మట్టిపాత్రలో దుప్పి మాంసం నైవేద్యం పెట్టినట్టు చూపించడం విస్మయం కలిగించింది. ఇక రీసెంటుగా 'కన్నప్ప' నుంచి 'సగమై చెరిసగమై' అంటూ సాగే మరో లిరికల్ సాంగ్ ను వదిలారు. మొదటి పాట మాదిరిగానే ఈ పాట కూడా విమర్శల నుంచి తప్పించుకోలేకపోయింది. "కోయగూడానికి చెందిన భార్యాభర్తలు ఆ యాసలోనే పాటలు పాడుకుంటారు.. గతంలో వచ్చిన 'భక్త కన్నప్ప'లోని పాటలు ఇప్పటికీ నిలిచిపోవడానికి కారణం ఆ సహజత్వమే. కానీ ఈ పాటలో కన్నప్ప పాత్రకి 'ఇరు పెదవుల శబ్దం .. విరి ముద్దుల యుద్ధం' అనే ప్రయోగం చేశారు. ఇది ఒక సాధారణ యువతీ యువకులు పాడుకునే పాట మాదిరిగానే ఉందిగానీ, కోయగూడానికి చెందిన ఆలుమగలు పాడుకునే పాటలా లేదనే విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి.

**-రాజేష్ కోత**







# వాలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం అటకెక్కించింది

(సత్యంన్యూస్, పాతపట్నం)



అధికారంలోకి వచ్చేందుకు ఎన్ని అబద్ధాలు చెప్పడానికైనా వెనుకాడని వ్యక్తి చంద్రబాబు నాయుడు అని మరోసారి నిరూపితమైంది. అధికారం కోసం అలవి కాని హామీలు ఇచ్చి ఇప్పుడు తీర్చలేక ప్రజలను మోసం చేస్తున్నారు. మరోవైపు ఎన్నికలకు ముందు వాలంటీర్లపై కపట ప్రేమ చూపించి అధికారంలోకి వచ్చాక వారిని నట్టేట ముంచేశారని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు మొదటి నుంచీ వాలంటీర్లపై అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ఎలక్షన్స్ ముందు కపట హామీలతో వాలంటీర్లను మభ్య పెట్టారన్నారు. చంద్రబాబు తేనె పూసిన కత్తికి బలైపోయి లక్షలాది మంది వాలంటీర్లు రోడ్డున పడ్డారన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలు ఇతర సేవలను ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్లో వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. పెన్షన్ల నుంచి పౌర సరఫరా సేవలతోపాటు ఇతర సేవలను ప్రజలకు నేరుగా అందేలా చూసేవాళ్లు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు వాలంటీర్లను నట్టేట ముంచేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన వాలంటీర్ల వ్యవస్థపై ఏపీ అసెంబ్లీలో, శాసన మండలిలో తీవ్ర చర్చ జరుగుతోందన్నారు. వాలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని ఎన్నికల్లో చెప్పి మోసం చేసి సుమారు 2.60 లక్షల మందిని తొలగించడం అన్యాయమన్నారు.

# సచివాలయ ఏఎన్ఎంల పదోన్నతులు చేపట్టాలి

## టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నల్లి రవికుమార్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గ్రామ వార్డు సచివాలయ ఏఎన్ఎంలకు వెంటనే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏపీ గవర్నమెంట్ మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర సహాధ్యక్షులు డాక్టర్ నల్లి రవికుమార్, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రేడ్-3 ఏఎన్ఎంల పదోన్నతుల ప్రక్రియ సత్వరమే చేపట్టాలని కోరారు. వివిధ జిల్లాలలో గ్రేడ్-3 ఏఎన్ఎంల ఆఖరిజాబితా కూడా తయారైందన్నారు. కడప, అనంతపురం, అన్నమయ్య చిత్తూరు వంటి జిల్లాల్లో ఇప్పటికే పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. బుధవారం నుంచి అనంతపురంలో కౌన్సిలింగ్ జరగనుందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మాత్రం ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదన్నారు. మూడు నెలల క్రితం విడుదల చేసిన ప్రొవిజినల్ జాబితాలో ఉన్న గ్రీవెన్సలను పరిష్కరించి తుది జాబితాని విడుదల చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కోరారు. దీనికి స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలమురళీకృష్ణ సంబంధిత కార్యాలయ అధికారిక సిబ్బందిని పిలిపించి రెండురోజుల్లోగా ఖచ్చితమైన జాబితాను పారదర్శకంగా తయారుచేసి దానిలో ఉన్న గ్రీవెన్స్ను పూర్తిస్థాయిలో పరిష్కరించి శుక్రవారం నాటికి శ్రీకాకుళం జిల్లా గ్రేడ్-3 సచివాలయ ఏఎన్ఎంల తుది జాబితాను విడుదల చేస్తామన్నారు. మూడు రోజుల పాటు మరల చిన్నచిన్న సవరణలు ఉన్నట్లయితే వాటికి అవకాశం ఇచ్చి తదుపరి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. సచివాలయ ఏఎన్ఎంల అంశంలో వర్క్ ఫ్రం హోం, టి4 వంటి యాప్ల వలన పని భారం బాగా పెరుగుతుందని లక్ష్యాలను తట్టుకోవడంలో చాలా ఇబ్బంది పడుతున్నామని ఏఎన్ఎంలు వాపోయారు. ఎన్సీడీసీడీ, జాతీయ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం అమలు, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఈ కార్యక్రమాలను సఫలీకృతం చేయడంలో పూర్తి సమయం కేటాయించడం ద్వారా పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన ఎనిమిది టైల్స్తో కూడిన వర్క్ ఫ్రం హోం, పీ-ఫోర్ వంటి యాప్స్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయమని పై పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఒత్తిడిని తట్టుకోలేకున్నామన్నారు. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారు స్పందిస్తూ దీనిని పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రవికుమార్, జామి శ్రీనివాసరావు, గోవింద్, ప్రసాద్, సూర్యనారాయణ, జయలక్ష్మి, శాంతమ్మ, ఏఎన్ఎంలు లలిత, విజయ,సోమేశ్వరి, త్రివేణి, రాజు, బాలమణి నీలవేణి అనురాధ, చిన్నమ్మి, వివిధ పీహెచ్సీల నుంచి అర్బన్ పీహెచ్సీ నుంచి విచ్చేసిన సచివాలయ గ్రేడ్ 3 ఏఎన్ఎంలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెన్షనర్ల సేవలు ప్రశంసనీయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎస్బీఐలో పనిచేస్తూ నిరంతర సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు పెన్షనర్లు అసోసియేషన్గా ఏర్పాటుచేసి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ అన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఎస్బీఐ పెన్షనర్ల అసోసియేషన్ నాలుగో వార్షికోత్సవ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తిలో నిరంతరము ఉంటూ పదవీ బాధ్యతల అనంతరం ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా సేవా కార్యక్రమాలు, పెన్షనర్లు సమస్యలపై పోరాటం చేస్తూ వారి సమస్యను పరిష్కరించే దిశగా అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. ఇది అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ హేమంత్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ సౌరవ్ గోస్, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



# ఉదాసీన వైఖరి విడనాడాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దయనీయ పరిస్థితుల్లో ఉన్న ఇ.పి.ఎస్ పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం, ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఉదాసీన వైఖరి విడనాడాలని శ్రీకాకుళం జిల్లా ఆల్ పెన్షనర్స్ & రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పీఎఫ్ ఆఫీసు వద్ద వివిధ సంస్థల విశ్రాంత ఉద్యోగులు చేసిన నిరసన ప్రదర్శన సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు దొంతం పార్వతీశం, మణికొండ ఆదినారాయణమూర్తిలు మాట్లాడుతూ ఇ.పి.ఎస్ పెన్షనర్లు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారన్నారు. మొత్తం 78 లక్షలలో సుమారు 37 లక్షల మంది వెయ్యి రూపాయలు లోపు మాత్రమే పెన్షన్ పొందుతున్నారన్నారు. 90శాతం ఉద్యోగులు రూ.3 వేల లోపు పెన్షన్ పొందుతున్నారన్నారు. అతి కొద్దిశాతం మాత్రమే 5 వేలు అందుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర, ప్రైవేట్, సహకార సంస్థలలో ఈపీఎస్ ఉద్యోగులుగా 30,40 సంవత్సరాలు తయారీ, సేవారంగాల్లో పనిచేసి దేశాభివృద్ధికి కీలకమైన పాత్ర పోషించారన్నారు. ఫలితంగా దేశం ఉన్నత స్థాయికి ఎదిగిందని, కానీ వీరు కనీస అవసరాలు తీర్చుకోలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారన్నారు. మొత్తం వడ్డీ పెన్షన్ చెల్లింపుకు వినియోగించినా సరాసరి పెన్షన్ రూ.5,731లే చెల్లించవచ్చన్నారు. పథకం మొదలైన నాటి నుండి ఇదే పరిస్థితి కొనసాగుతోందని, అంతేకాకుండా పెన్షనర్ మరణించిన తర్వాత తన భవిష్యత్తు నిధి మొత్తం వాపసు చేయబడదన్నారు. కార్పస్ ఫండ్కు జమ చేయబడుతుంది. ఈ కారణాలవల్ల కార్పస్ ఫండ్ నిరంతరం పెరుగుతూనే ఉందన్నారు. అనంతరం పి,ఎఫ్ కమిషనర్కు పై డిమాండ్లతో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి జి శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, పి.వాసుదేవరావు, బి.శివాజిలు పాల్గొన్నారు.

# బెస్ట్ న్యూస్ ఫోటో అవార్డును అందుకున్న సింహాచలం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలంగాణా ఫోటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా బషీర్బాగ్ దేశోద్ధారక భవన్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన పి.సింహాచలం, ఈనాడు ఫోటో జర్నలిస్ట్కు 2024వ సంవత్సరంలో తీసిన ఫోటో ఉత్తమ న్యూస్ ఫోటోగా ఎంపికైంది. ఈ సందర్భంగా తెలంగాణా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. చిత్రంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవుపల్లి అమర్ ఉన్నారు. ఈయన ప్రస్తుతం ఉమ్మడి అదిలాబాద్ జిల్లా (అదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్) జిల్లాలకు ఈనాడు జర్నలిస్ట్గా పని చేస్తున్నారు.





పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు, పారాపురం పంచాయతీల్లో సర్పంచ్ ప్రతినిధులు వైకాపాను వీడి టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు టీడీపీ కండువాలను కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు, పారాపురం సర్పంచ్ ప్రతినిధి నూకరాజు కుంచల, మాజీ ఏఎంసీ చైర్మన్ గూగుల్ వరప్రసాద్ పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, కొత్తూరు

# విద్యార్థుల మనోవేదనను దయచేసి అర్థం చేసుకోండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీపీఎస్సీ గ్రూప్-2 అభ్యర్థుల నోటిఫికేషన్లు, ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ)లు 436, 77ల వల్ల ఏర్పడిన అనిర్చితి గురించి విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, సమాంతర రిజర్వేషన్ (హారిజంటల్ రిజర్వేషన్), రోస్టర్ ఖరారు, అమలుపై స్పష్టత లేకపోవడం అభ్యర్థుల్లో గందరగోళం, ఆందోళనకి దారి తీసిందని అభ్యర్థులకు పారదర్శకత న్యాయం, సమాన అవకాశాలు నిర్ధారించడానికి ప్రభుత్వ పెద్దలు త్వరగా స్పష్టత ఇవ్వాలని టెక్కలి జై భారత్ నేషనల్ పార్టీ ఇన్చార్జ్ బైపల్లి పరమేశ్వరరావు కోరారు. ఆంధ్రప్రదేశ్లో గత కొన్నాళ్లుగా గ్రూప్-2 విద్యార్థులు పడుతున్న వేదనను ప్రభుత్వ పెద్దలు అర్థం చేసుకోవాలన్నారు. ఏ ప్రభుత్వంలో తప్పులు జరిగిన పక్కన పెట్టి పెద్దమనసుతో 92000 పైగా విద్యార్థుల జీవితాలు వాళ్ల కుటుంబాల మనోవ్యధను అర్థం చేసుకుని ఎంతగానో ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతను ప్రభుత్వ పెద్దలు ఆదుకోవాలని కోరారు. కాగా టెక్కలి సబ్ కలెక్టర్ ఎం.కృష్ణమూర్తికి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం పుష్పగుచ్ఛంను అందచేశారు



# జీడి రైతులను ఆదుకోవాలి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

మండలంలోని చిన్నరావుపల్లి, బలిజిపేట, సంతసీతారాంపురం, కొయ్యాం తదితర గ్రామాల రైతులు జీడిపంటపై ఎక్కువగా ఆధారపడతారు. అయితే కాపుకాసిన సమయంలో పిక్కకు తెగులు పట్టడంతో నష్టపోతున్నామని జీడిరైతు పప్పల శ్రీనివాసరావు మంగళవారం పేర్కొన్నారు. మంచు అధికంగా కురవడంతో జీడిపంట నాశనం అవుతుందన్నారు. సంవత్సరం అంతా ఎంతో ఖర్చుతో జీడిపంటని సాగు చేస్తామని తెలిపారు. జీడితోటను దున్నించడం, ముందస్తు చర్యగా పురుగు పట్టకుండా మందులు వేయటం, ఇతరత్రా ఎంతో ఖర్చుతో కూడుకున్న పంటను సాగు చేస్తున్నామన్నారు. చివర్లో ఇలా తెగులు పట్టడంతో తమకు ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. తమను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని జీడి రైతులు కోరుతున్నారు.


















## మహిళల రక్షణ కవచంగా
# 'శక్తి యాప్'



(సత్యంన్యూస్, నరసన్నపేట)

మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా కంప్లైంట్ చేయొచ్చని శక్తి టీం సబ్ ఇన్‌స్పెక్టర్ వి.బాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆపద కాలంలో అత్యవసర సహాయం అందించేందుకు శక్తి యాప్ కీలకంగా పని చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఈ శక్తియాప్‌లో తప్పిపోయిన పిల్లల వివరాలు, అక్రమ కార్యకలాపాలపై రిపోర్టు చేయడం, రాత్రివేళల్లో భద్రతతో కూడిన ప్రయాణం, పోలీసు అధికారుల వివరాలు తదితర ఫీచర్స్‌ను పొందుపరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాస్, అధ్యాపకులు లక్కోజు గౌరీశంకర్, రమణ, కానిస్టేబుళ్లు కుసుమ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# కంగ్రాట్స్..! మీరు పూర్ టు రిచ్ అయ్యారు

మొదటిపేజీ తరువాయి

చూపించాలనే తెర వెనుక లక్ష్యం మేరకు ఈ పనిని పూర్తిచేసేశారు. వాస్తవానికి ఇంటి యజమాని మొబైల్‌కు ఓటీపీ వచ్చిన తర్వాత సర్వేను పూర్తిచేయాలి. కానీ సచివాలయ సిబ్బంది తమ మొబైల్‌కే ఓటీపీ తెప్పించుకొని సర్వే పూర్తయిపోయిందని తేల్చేశారు. అయితే ఇందులో ఎంత మంది నష్టపోతారన్నది ఏప్రిల్‌లో కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు ఇస్తేగానీ తెలియదు.

పబ్లిక్ ప్రైవేటు పీపుల్ పార్టనర్‌షిప్ పేరుతో పీ-4 సర్వేను పైలెట్ ప్రాజెక్టుగా కడప జిల్లాల్లో గత నెల 20 నుంచి ఈ నెల 3 వరకు నిర్వహించింది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 8 నుంచి 18 వరకు నిర్వహించాలని అధికార యంత్రాంగానికి ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. పీ-4 సర్వే పూర్తి చేసిన తర్వాత ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించి పేదలను వర్గీకరించి నిరుపేదల వివరాలను వెల్లడించనున్నారు.

**పేదల అవసరాలను గుర్తించడానికి**

ఈ సర్వే పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న కార్యక్రమాలకు అదనంగా సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలు తమ సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలుస్తుందని ప్రభుత్వం చెబుతుంది. పేదల అవసరాలను గుర్తించి వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈ సర్వే దోహదం చేస్తుందని ప్రకటించింది. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా కుటుంబ అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించి సంపద సృష్టించి పేదరికాన్ని నిర్మూలిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 20 శాతం నిరుపేద కుటుంబాలను గుర్తించి గ్రామసభల ద్వారా నిర్ధారిస్తామంటున్నారు. పారిశ్రామికవేత్తలు, ఎన్‌ఆర్‌ఐలు, దాతల సహకారంతో గుర్తించిన నిరుపేదల జీవన పరిస్థితులు మెరుగుపరచడమే సర్వే ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం గ్రామాల దత్తత అనే కాన్సెప్ట్‌ను తెరపైకి తీసుకువచ్చి గ్రామాల్లో బడులు, గుడులతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు పారిశ్రామికవేత్తలు, ఎన్‌ఆర్‌ఐలు, దాతల సహకారం కోరారు. ఇది కేవలం గ్రామాల అభివృద్ధికి సంబంధించిన కాన్సెప్ట్ కాగా ప్రస్తుతం నిరుపేద కుటుంబాల కోసం పీ-4 సర్వే నిర్వహిస్తున్నారు.

**హౌస్ హోల్డ్ డేటాను వినియోగించి..**

జిల్లాలో మొత్తం 930 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. గ్రామాల్లో 835 సచివాలయాలు ఉండగా, అర్బన్ ప్రాంతాల్లో 95 సచివాలయాలు ఉన్నాయి. పీ-4 సర్వేలో భాగంగా జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించారు. గ్రామ, వార్డు సచివాలయ శాఖ ద్వారా ఏయే కుటుంబాల వివరాలు సేకరించాలో ఇప్పటికే సచివాలయ సిబ్బందికి సమాచారం అందించారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలను నమోదు చేశారు. సర్వే ద్వారా సంక్షేమ పథకాలు పోతాయనే భయంతో వివరాలు దాచిపెడితే సర్వే సిబ్బంది తాము స్వయంగా చూసి పరిశీలించిన అంశాలను అందులో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. తమ ఇంటికి కరెంట్ కనెక్షన్ లేదని చెప్తే ఇంట్లో ఫ్యాన్ తిరుగుతుంటే ఆ సౌకర్యం ఉందని నమోదు చేయాలని సూచించింది. సర్వేకు నిరాకరించే కుటుంబాల వివరాలను నమోదు చేయాలని సర్వే కోసం 27 రకాల ప్రశ్నావళిని రూపొందించారు. ఇంట్లో కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్ నెంబర్ల కోసం గతంలో చేపట్టిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ డేటాను ఉపయోగించారు. ఇంటి యజమానికి ఫోన్ ఉంటే నెంబరు నమోదు చేసి ఓటీపీ వెరిఫికేషన్ చేయనున్నారు. లేదంటే సచివాలయం సిబ్బంది ఫోన్‌కే ఓటీపీ పంపించి వెరిఫికేషన్ పూర్తి చేస్తున్నారు. పట్టణాల్లో కొందరు సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లకుండానే హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ఆధారంగా సొంత ఫోన్‌కి ఓటీపీ సెండ్ చేసి ఇంటో టీవీ, ఫ్రిజ్ ఉందని సర్వే పూర్తి చేస్తున్నారు.

**పీ-3తోనే ప్రారంభమైన సర్వీసు ఛార్జీలు**

ప్రపంచీకరణ వల్ల పీ-3 విధానం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అనేక భారాలు మోపిందని చెప్పడానికి ఉదాహరణలు అనేకం ఉన్నాయి. పీ-3 అమల్లోకి వచ్చిన తర్వాతనే వివిధ రకాల ఛార్జీల పేరుతో అన్ని రంగాల్లో వసూలుచేయడం ప్రభుత్వాలు ప్రారంభించాయి. ఇప్పుడు పీ-4పైనా అనుమానాలు వినిపిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందంలో భాగంగానే పీ-4 సర్వే తెరపైకి వచ్చిందన్న అనుమానాలు లేకపోలేదు. రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు సేకరించడానికి పీ-4 సర్వేను ఒక అస్త్రంగా వాడుకొనేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిందన్న వాదన ఉంది. సర్వేలో సేకరిస్తున్న వివరాలు అందుకు బలం చేకూరుస్తున్నాయి. వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రభుత్వం సర్వేలో సేకరిస్తున్న ఆస్తులు, ఇళ్లు, వాహనాలతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలనూ ఆస్తులుగా పరిగణిస్తున్నారు. ఇంట్లో టీవీ, ల్యాప్‌టాప్, కంప్యూటర్, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, ఏసీ వంటి పరికరాలనూ ఆస్తులుగానే పరిగణించనుంది. తాగునీటి కోసం ట్యాప్ కనెక్షన్, పబ్లిక్ ట్యాప్, చేతిపంపులు, బావులు, సీసా నీళ్లు ఇలా ఏవి వినియోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కుటుంబం పక్కా ఇంట్లో నివసిస్తుందా? లేక కచ్చా ఇంట్లో ఉంటున్నారో వివరాలు నమోదు చేశారు. ఇంట్లో వంట గ్యాస్ వినియోగిస్తున్నారా? లేక కట్టెలు, బొగ్గు వంటి వంట చెరుకు ఉపయోగిస్తున్నారా అన్నది నమోదు చేశారు. అర్బన్ ప్రాంతాల్లో సొంత ఆస్తుల వివరాలను సేకరిస్తున్నారు.

**నిరుపేదలను గుర్తించేందుకే సర్వే**

పేదల్లో ఉన్న 20 శాతం మందినే అత్యంత నిరుపేదలుగా గుర్తించేందుకు సర్వే చేపడుతున్నట్లు ప్రభుత్వం పేర్కొనడం, సర్వేలో సేకరిస్తున్న వివరాలు మరింత అనుమానాలకు తావిస్తోంది. సర్వే సిబ్బంది సేకరిస్తున్న వివరాల్లో ఎక్కువ భాగం ఆదాయానికి సంబంధించిన ప్రశ్నలే ఉండడం పలు సందేహాలకు తావిస్తోంది. కుటుంబంలో సంపాదిస్తున్న వారి జాబితాలో పింఛను పొందుతున్న వృద్ధులనూ చేర్చడం అనుమానాలను కలిగిస్తోంది. వారితో పాటు వ్యవసాయ భూమి ఉన్న వారు, వ్యవసాయ కూలీలు, అద్దెలు రూపంలో ఆదాయం పొందుతున్నవారూ ఉన్నారు. ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఉన్నారా? ఇంట్లో చదువుకున్న నిరుద్యోగుల వివరాలను సేకరించారు. వివరాలు నమోదు చేసినపుడు బయోమెట్రిక్ ద్వారా ధృవీకరిస్తున్నారు. సంపాదనపరుల జాబితాలో వ్యవసాయ కూలీలు, పెన్షనర్ల పేర్లు చేరుస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## పెన్షనర్ల అసోసియేషన్ ధర్నా




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కనీస పెన్షన్ రూ.9వేలు డీఏతో కలిపి చెల్లించాలని, హయ్యర్ పెన్షన్ అందరికీ ఎటువంటి అభ్యంతరాలు లేకుండా అమలుచేయాలని, ఈపీఎస్ 95 పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యసదుపాయం కల్పించాలని, సీనియర్ సిటిజన్లకు రైలుప్రయాణంలో రాయితీ కల్పించాలన్న డిమాండ్లతో మంగళవారం స్థానిక ఈపీఎఫ్ కార్యాలయం వద్ద ఆల్ పెన్షనర్ల్ & రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నిరసన చేపట్టింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి. ఆదినారాయణ, ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా కార్యదర్శి పీవీ రావు, అధ్యక్షుడు బీఎల్ రావు, జాయింట్ సెక్రటరీ కె.ఆనందరావు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలు ఎలా రాస్తున్నారు?

- ఆరా తీసిన అడిషనల్ డైరెక్టర్ -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ సమీపంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులను ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలు ఎలా రాస్తున్నదీ విజయవాడ అడిషనల్ డైరెక్టర్ గిరిజన సంక్షేమ శాఖ, రాష్ట్రపరిశీలకులు రామశేషు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమాధానాలకు సంతృప్తి చెందారు. వీరితో పాటు డిప్యూటీ డైరెక్టర్ అన్నాదొర, ఏటీడబ్ల్యూవో శ్రీనివాసరావు, ఏఎంవో కోటిబాబు, ప్రధానోపాధ్యాయులు దేవళ్ల శ్రీనివాసరావు, వసతి గృహసంక్షేమ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 'కసి'తీరా భార్యనే నరికేశాడు!

(మొదటిపేజీ తరువాయి)

స్థలంలోనే మృతి చెందినట్టు పోలీసులు చెబుతున్నారు. మృతురాలి సోదరుడు త్రినాథరావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు విశాఖపట్నంలో తాపీమేస్త్రిగా పని చేస్తున్నట్టు తెలిపారు. సంఘటనా స్థలానికి జేఆర్ పురం సీఐ అవతారం, ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్‌తో పాటు క్లూస్ టీం చేరుకొని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

## విద్యుత్ మీటర్ రీడర్స్‌కు
# ఉద్యోగ భద్రత కల్పించాలి




(సత్యంన్యూస్, టెక్కలి)

విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు టెక్కలి విద్యుత్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ మీటర్ రీడర్స్ టెక్కలి డివిజన్ గౌరవ అధ్యక్షులు సిహెచ్ రవి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ మీటర్ రీడర్స్‌గా విధులు నిర్వహిస్తున్న కార్మికులను నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డున పడేశాయని వాపోయారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ఎవరికి ఉపయోగమని ప్రశ్నించారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలన్నారు. విద్యుత్ మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హత ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని కోరారు. డివిజన్లో సబ్ డివిజనల్‌లో చెట్లు కోత తదితర శాఖల్లో తమను నియమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీను, రాము, కిరణ్, సాయి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

గ్యాస్ డెలివరీ పేరుతో నిర్దేశించిన సిలిండర్ ధర కంటే అదనంగా వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దారు ఎస్.చక్రవర్తి సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం అన్ని గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, డోర్ డెలివరీ బాయ్స్‌తో సమావేశం ఏజెన్సీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలెండర్ డెలివరీ సమయంలో వినియోగదారుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు అందాయన్నారు. ఇటీవల ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా వినియోగదారుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తుందన్నారు. కొందరు వినియోగదారులు ఐవీఆర్ఎస్ కాల్స్‌కు స్పందించి అదనపు వసూళ్లపై ఫిర్యాదులు ఇచ్చినట్టు తెలిపారు. ప్రతి రోజు క్షేత్రస్థాయిలో గ్యాస్ వినియోగదారుల నుంచి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా సమాచారం సేకరిస్తుందన్నారు. అదనపు వసూళ్లకు పాల్పడిన ఆయా ఏజెన్సీల



గ్యాస్ డోర్ డెలివరీ బాయ్స్ సమాచారం ప్రభుత్వం వద్ద ఉందన్నారు. ఆ సమాచారం, ప్రభుత్వ ఆదేశాల మేరకు జేసీ సూచనలతో సమావేశాలు నిర్వహిస్తునట్టు తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ వద్ద అదనపు వసూళ్లకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్‌పై ఏజెన్సీల యాజమాన్యాలు నిఘా పెట్టాలని సూచించారు. సమావేశాలు అనంతరం ఫిర్యాదు అందితే సంబంధిత ఏజెన్సీపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏజెన్సీల యాజమాన్య ప్రతినిధులు డబ్బీరు వాసు, ఎల్.కుమారి, డెలివరీ బాయ్స్ పాల్గొన్నారు.

# రోటరీ సేవలు విస్తృతం చేయాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రోటరీ సేవలు మరింత విస్తృతం చేయాలని రోటరీ గవర్నర్ డాక్టర్ మల్లా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక 80 అడుగుల రోడ్డులని ఫక్షన్ హాల్లో రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ అధికారిక పర్యటన సందర్భంగా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా రోటరీ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు వివరించారు. సమావేశానికి ముందుగా రోటరీ గవర్నర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని రోటరీ వనం సందర్శించి మొక్కలు నాటారు. పబ్లిక్ హెల్త్ చైర్ ఎంఆర్‌కే దాస్ తల్లిదండ్రులు ఎంబికే దాస్, ఎం.అమ్మాజీ, సోదరుడు ఎం.ఎన్.ఎన్.దాస్ జ్ఞాపకార్థం 14 మందికి ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి బృందావనం మందిరంలో రోటరీ, సత్యసాయి సంయుక్త ఆధ్వర్యంలో కంప్యూటర్ ఉచిత శిక్షణా కేంద్రంను ప్రారంభించారు. ముందుగా క్లబ్ అధ్యక్షులు ముని శ్రీనివాసరావు, కార్యదర్శి దూసి సంతోష్ క్లబ్ శ్రీకాకుళం అందించిన సేవా కార్యక్రమాలను వివరించారు. తర్వాత క్లబ్ వోకేషనల్ డైరెక్టర్ డాక్టర్ మంత్రి వెంకటస్వామి పర్యవేక్షణలో శ్రీకాకుళం జిల్లాలో వివిధ రంగాల్లో నిష్టాతులైన పదిమందికి రోటరీ పురస్కారం డిస్ట్రిక్ట్ గవర్నర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ గవర్నర్ రజనీకాంతరావు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ దేవరశెట్టి శివశంకర్, ప్రెసిడెంట్ ఎలక్ట్ బరాటం శ్రీనివాస, సెక్రటరీ ఎలక్ట్ కిల్లాన శ్రీనివాసరావు, పోలియో చైర్ అన్నెపు అనంతరావు, రోటరీ ప్రతినిధులు దూసి శివప్రసాద్, డాక్టర్ బమ్మిడి సందీప్, డాక్టర్ వారణాశి సందీప్, అన్నెపు సత్యనారాయణ, ఎస్కే గౌరీశంకర్, ఇప్పిలి వెంకన్నశెట్టి, వి. సంతోష్‌కుమార్, గిరి, పసగాడ సూర్య, నాతాడ వెంకటరావు, జైశ్రీరామ్, డాక్టర్ కే.సోమేశ్వరరావు, రోటరీ సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

## స్ఫూర్తిమంత్రం.. సేవలతో 'పునీత'ం!

(మొదటిపేజీ తరువాయి)

పొంది.. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను పునీత్ రాజ్‌కుమార్‌కు అంకితం చేశారు. డాక్టర్ పునీత్ రాజ్‌కుమార్ అసోసియేషన్‌ను స్థాపించి, దాని గొడుగు కింద సేవా కార్యక్రమాలను విస్తరించారు. ఈ కార్యక్రమాలకు కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు ప్రకాష్, తేజ, శేఖర్, ప్రసాద్, రామారావులు సహకరిస్తున్నారు.

**ఉదారంగా సేవలు**

- పోలాకి మబగాం గ్రామానికి చెందిన లావేటి చంద్రశేఖర్ కుమారుడు దేవహర్ష అసెప్టిక్ మెనంజైటిస్ అనే వ్యాధితో బాధ పడుతున్న విషయం తెలుసుకుని కొందరు దాతల సహకారంతో ఆ బాలుడి చికిత్సకు రూ.20,500 అందజేశారు.
- స్వగ్రామమైన జగన్నాథపురం జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు స్పోర్ట్స్ దుస్తులు, షూస్ అందించడంతోపాటు పాఠశాలకు వాటర్ క్యాన్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ సమకూర్చారు. ఇదే పాఠశాల పదో తరగతి విద్యార్థులకు విద్యా మెటీరియల్ అందజేశారు.
- అదే గ్రామ ఎంపీయూపీ స్కూల్‌లో 70 మంది విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. అలాగే విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు.
- టెక్కలి పట్టణంలో ఆది ఆంధ్ర వీధికి చెందిన నిరుపేద కుటుంబానికి నెల రోజులకు సరిపడ నిత్యావసర సరుకులు, కొంత నగదు ఇచ్చారు.
- జగన్నాథపురం గ్రామదేవత గుడికి అసోసియేషన్ తరఫున రూ.6666 విరాళం ఇచ్చారు.
- పునీత్ రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు షీల్డులు, బహుమతులతోపాటు విద్యార్థులకు, క్రీడాకారులకు పునీత్ బొమ్మతో టీషర్టులు, క్యాప్స్ పంపిణీ చేశారు. ఇదే సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు.
- జగన్నాథపురం క్రికెట్ టీమ్ సభ్యులకు 40 టీషర్టులు అందజేశారు.
- గార మండలం సతివాడ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన దుమ్ము కారుణ్య అనే చిన్నారి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆర్థిక సహాయం చేశారు.
- రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకుని ఉపాధి కోల్పోయిన కంబళరాయుడుపేట గ్రామానికి చెందిన ఒక వ్యక్తి చిన్న షాపు పెట్టుకునేందుకు కొంత నగదు సాయం చేశారు.
- రెడ్డిక మేఘవరం గ్రామ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందజేశారు.
- దండుగోపాలపురానికి చెందిన ఒక విద్యార్థి వాలీబాల్ ఆడుతుండగా సంభవించిన ప్రమాంతో చెయ్యి దెబ్బతింది. అతని ఆపరేషన్‌కు అవసరమైన నగదు సహాయం అందజేశారు.
- సంతబొమ్మాళి మండలం గోవిందపురం పంచాయతీ పంగజగ్గపేట గ్రామానికి చెందిన నిలువనీడ లేని నీలాపు చిన్నమ్మ అనే ఒంటరి మహిళకు నెలకు సరిపడా రేషన్, రూ.11వేల నగదు అందజేశారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.